విద్యుత్ కోతలతో అవస్థలు

- తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం
- కాలిపోతున్న గృహోపకరణాలు
- ఇబ్బందులు పడుతున్న చిట్యాల పట్టణ ప్రజలు


చిట్యాలలో విద్యుత్ ఏఈని నిలదీస్తున్న ప్రజలు

చిట్యాల : విద్యుత్ కోతలతో చిట్యాల మున్సిపాలిటీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ లైన్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో తరచూ పట్టణంలోని పలువురి ఇళ్లలో విలువైన విద్యుత్ గృహోపకరణాలు, టీవీలు కాలిపోతున్నాయి. అయినప్పటికీ విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

గంటల కొద్దీ విద్యుత్ కోతలు..

చిట్యాల మున్సిపాలిటీ పరిధిలో రెండు, మూడు నెలలుగా విద్యుత్ ఫీడర్స్ తరచూ బ్రేక్‌డౌన్ అవుతున్నాయి. దీంతో ఇటీవల కాలంలో పట్టణంలో రెండు నుంచి నాలుగు గంటల వరకు విడతల వారీగా విద్యుత్ సరఫరాలో కోతలు విధిస్తున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో గంటల కొద్ది విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ సమయంలో విద్యుత్ సిబ్బంది ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసుకుంటున్నారు. కాగా మున్సిపాలిటీ ప్రజల అవసరాలకు అనుగుణంగా విద్యుత్ లైన్‌మెన్లు, హెల్పర్లు సిబ్బంది లేకపోవడంతో విద్యుత్ మరమ్మతులు చేపట్టడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది.

వర్షం పడితే విద్యుత్ సరఫరా నిలిపివేత..

చిన్నపాటి వర్షం కురిసినా, ఈదురు గాలులు వీచినా చిట్యాలలో వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. విద్యుత్ లైన్ నిర్వహణ సక్రమంగా లేకపోవడంతోపాటు, విద్యుత్ తీగల కిందనే మొక్కలను పెంచుతున్నారు. ఇటీవల భువనగిరి రోడ్డులో విద్యుత్ తీగల కింద హరితహారం కార్యక్రమంలో నాటిన యాభైకి పైగా చెట్లను నరికివేశారు.

ఏఈ నిలదీత..

మున్సిపాలిటీలోని 12వ వార్డులో బుధవారం ఉదయం ముందస్తు సమాచారం లేకుండా నాలుగైదు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో ఆ వార్డు ప్రజలంతా కౌన్సిలర్ రెముడాల లింగస్వామి ఆధ్వర్యంలో ట్రాన్స్‌కో కార్యాలయం ముట్టడించారు. విషయం తెలుసుకున్న విద్యుత్ ఏఈ రవీందర్‌రెడ్డి ఆ వార్డులోకి రావడంతో ఆయనను వార్డు ప్రజలంతా ఒక్కసారిగా చుట్టుముట్టారు. సమాచారం లేకుండా విద్యుత్ కోతలు విధిస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నామని, అప్పుడప్పుడు అధికంగా వస్తున్న విద్యుత్‌తో గృహోపకరణాలు కాలిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ సిబ్బంది కొరతతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, విద్యుత్ వినియోగం పెరిగిపోవడంతో బ్రేక్‌డౌన్ అవుతోందని ఏఈ వివరించారు. విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని ప్రజలకు సర్దిచెప్పారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు

పట్టణంలో రెండు మూడు నెలలుగా ముందస్తు సమాచారం లేకుండా తరచూ విద్యుత్ కోతలు విధిస్తున్నారు. విద్యుత్ సమస్యను ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో ఇబ్బందిగా మారింది. ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ కోతలు లేకుండా చర్యలు తీసుకోవాలి.

–శీలా రాజయ్య, చిట్యాల మున్సిపాలిటీ 12వ వార్డు

ఇబ్బందులు పడుతున్నాం

మా 12వ వార్డులో ఇటీవల విద్యుత్ కోతలతో ఇబ్బందులు పడుతున్నాం. రాత్రి సమయాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. దీంతో దోమలు కుట్టి రోగాలబారిన పడే పరిస్థితి ఏర్పడుతోంది. అధికారులుగానీ, ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకోవడం లేదు. పట్టణంలో విద్యుత్ కోతలు లేకుండా చూడాలి.



–గీత, చిట్యాల మున్సిపాలిటీ 12వ వార్డు

అభివృద్ధిలో ముందంజలో నల్లగొండ


పార్టీలోకి ఆహ్వానిస్తున్న నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : సీఎం కేసీఆర్ దత్తత తీసుకుని ఇచ్చిన మాట ప్రకారం వందల కోట్లు ఇచ్చిన నల్లగొండ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిలో ముందంజలో ఉంచారని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. నల్లగొండ పట్టణం, మండలం, కనగల్ మండలానికి చెందిన కాంగ్రెస్, సీపీఎం నాయకులు, కార్యకర్తలు 1000 మందికి పైగా బుధవారం ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నల్లగొండ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి చూసే వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. కేసీఆర్ పాలనలో అన్నివర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. పట్టణంలోని మూడో వార్డుకు చెందిన కాంగ్రెస్ నాయకుడు గాలి మురళి ఆధ్వర్యంలో 500 మంది, నల్లగొండ, కనగల్ మండలాలకు చెందిన వారు మరో 500 మందికి పైగా బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, బోనగిరి దేవేందర్, ధనలక్ష్మి, జనార్దన్‌రావు, పేర్ల జానయ్య, ఐతగాని యాదయ్య, వంగాల సహదేవరెడ్డి, దోటి శ్రీనివాస్, ఎంపీటీసీ నామ కౌసల్య, బైరగోని వెంకన్న, ఆయా మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

నాంపల్లి : అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని స్వాములవారి లింగోటం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కోన్‌రెడ్డి లక్ష్మయ్యకు రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ ఏడుదొడ్ల రవీందర్‌రెడ్డి బుధవారం రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

నేడు బీజేపీ సమావేశం

నల్లగొండ టూటౌన్ : బీజేపీ బస్సు యాత్రపై చర్చించేందుకు నల్లగొండలోని బీజేపీ కార్యాలయంలో గురువారం సమావేశం ఏర్పాటు చేసినట్లు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల రాజశేఖర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి బస్సు యాత్ర ప్రముఖ్ గుండగోని భరత్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

పంచాయతీలకు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు


చిట్యాల : అవార్డు అందుకుంటున్న ఉరుమడ్ల సర్పంచ్ కంచర్ల శ్రీనివాస్‌రెడ్డి

చిట్యాల : మండలంలోని ఉరుమడ్ల గ్రామం జిల్లా స్థాయి స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్–2023 ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డుకు ఎంపికైంది. నల్లగొండలో బుధవారం జరిగిన కార్యక్రమంలో అవార్డును ఉరుమడ్ల గ్రామ పంచాయతీ సర్పంచ్ కంచర్ల శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సిద్ది వీర సోమయ్యకు జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అందజేశారు. ఈ కార్యక్రమంలో చిట్యాల ఎంపీడీఓ బి.లాజర్, ఎంపీఓ పద్మ, జెడ్పీటీసీ సుంకరి ధనమ్మ పాల్గొన్నారు.

మునుగోడు, జక్కలవారిగూడెం గ్రామాలకు..

మునుగోడు : మండలంలోని మునుగోడు, జక్కలవారిగూడెం గ్రామాలకు స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ ఉత్తమ అవార్డు దక్కాయి. బుధవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు మిర్యాల వెంకన్న, జక్కలి శ్రీను, పంచాయతీ కార్యదర్శులు మురళీకృష్ణ, శ్వేతలకు కలెక్టర్, జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కర్నాటి స్వామి, ఎంపీడీఓ ఆర్.భాస్కర్‌గౌడ్, మండల పంచాయతీ అధికారి సుమలత తదితరులు పాల్గొన్నారు.

వట్టిపల్లి, తమ్మడపల్లి గ్రామాలకు..

మర్రిగూడ : స్వచ్ఛ సర్వేక్షణ్(గ్రామీణ్) 2023 జిల్లా ఉత్తమ గ్రామ పంచాయతీలుగా మండలంలోని వట్టిపల్లి, తమ్మడపల్లి గ్రామాలు ఎంపికయ్యాయి. శానిటేషన్, ఇంకుడు గుంతలు, వ్యక్తిగత మరుగుదొడ్లు, చెత్త సేకరణతోపాటు, వర్మి కంపోస్ట్ ఎరువు తయారీ తదితర అంశాలకు సంబంధించి పనులు సకాలంలో పూర్తిచేసి ముందంజలో ఉన్నందున బుధవారం జిల్లాస్థాయి ఉత్తమ అవార్డును కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్, జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, రమావత్ రవీంద్రకుమార్, డీఆర్‌డీఓ కాళిందిని చేతులమీదుగా ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు అవార్డులు అందుకున్నారు. రాష్ట్రస్థాయి ఉత్తమ గ్రామపంచాయతీగా వట్టిపల్లి ఎంపికైంది. గురువారం హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో గల టీఎస్ ఐఆర్‌డీలో ఆ గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి అవార్డు అందుకోనున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ జె.వెంకటేశ్వర్‌రావు, ఎంపీఓ యూసుఫ్, సర్పంచ్‌లు కల్లు స్వాతినవీన్‌రెడ్డి, కొట్టం మాధవిరమేష్, పంచాయతీ కార్యదర్శులు శిరీష, అక్షితలు పాల్గొన్నారు.


మర్రిగూడ : అవార్డు అందుకుంటున్న వట్టిపల్లి, తమ్మడపల్లి గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు


మునుగోడు : అవార్డు అందుకుంటున్న మునుగోడు సర్పంచ్ వెంకన్న

అంగన్‌వాడీ సిబ్బందికి కనీస వేతనం అందించాలి

నల్లగొండ టౌన్ : సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బందిపై నిరంకుశంగా వ్యవహరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. బుధవారం అంగన్‌వాడీ ఉద్యోగులు ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట చేస్తున్న సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి మద్దతు తెలిపి మాట్లాడారు. సమ్మె చేస్తున్న సిబ్బందిపై బెదిరింపులకు పాల్పడుతూ అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగులగొట్టడం హేయమైన చర్య అన్నారు. సమ్మెకు చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్, ఆర్‌కేఎస్ ఫౌండేషన్ చైర్మన్, కౌన్సిలర్ పిల్లి రామరాజు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం, సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, జిల్లా కమిటీ సభ్యుడు అద్దంకి నర్సింహ, అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు కె.విజయక్ష్మి, రత్నమాల, ప్రకృతాంబ, సునంద, ప్రమీల, పార్వతి, సముద్రమ్మ, నాగమణి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు దైద రవీందర్ ఆర్థికసాయం

నకిరేకల్ : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ సిబ్బంది నకిరేకల్‌లో చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం మూడో రోజుకు చేరుకుంది. ఈ సమ్మెకు కాంగ్రెస్ నేత దైద రవీందర్ మద్దతు తెలిపి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా సమ్మెకు సీపీఎం నేతలు కందాల ప్రమీల, బొజ్జ చిన వెంకులు, వంటిపాక వెంకటేశ్వర్లు, లూర్దు మారయ్య సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు పొడిచెటి నాగమణి, లక్ష్మీ, తరాల శోభారాణి, లూర్దు మేరీ, అండాలు, లలిత, లతీఫా, జయమ్మ, అరుణ, సుష్మిత, చంద్రమ్మ, మంగ, కవిత, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలి

నార్కట్‌పల్లి : తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ సిబ్బంది స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు చింతపల్లి బయ్యన్న పాల్గొని మాట్లాడుతూ అంగన్‌వాడీ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.


మునుగోడు : దీక్ష చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది


నార్కట్‌పల్లి : ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

వేతనాలు పెంచాలి

చండూరు : అంగన్‌వాడీ సిబ్బందిని రెగ్యులర్ చేసి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నలపరాజు రామలింగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సిబ్బంది చేస్తున్న సమ్మెకు బుధవారం ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు, సీపీఐ మండల కార్యదర్శి నలపరాజు సతీష్‌కుమార్, మండల అధ్యక్షుడు దోటి వెంకన్న, గంట రమేష్, సీహెచ్ ఊషయ్య, గడ్డం నవీన్, అంగన్‌వాడీ టీచర్లు కేదారి, జగదీశ్వరి, సునీత, శోభ, పార్వతమ్మ, సునీత, విజయ నిర్మల పాల్గొన్నారు.

కనీస వేతనం అందించాలి

మునుగోడు : అంగన్‌వాడీ సిబ్బందికి కనీస వేతనం అందించాలని సీఐటీయూ మండల గౌరవ సలహాదారు చాపల శ్రీను ప్రభుత్వాన్ని కోరారు. అంగన్‌వాడీ సిబ్బంది మూడు రోజులుగా ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మెకు బుధవారం ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది అన్నపూర్ణ, లక్ష్మి, లలిత, పారిజాత, రాధిక, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.


నల్లగొండ టౌన్: మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ


నకిరేకల్ : ఆర్థికసాయం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు దైద రవీందర్

ఉద్యమకారులకు ప్రాధాన్యం ఇవ్వాలి

చిట్యాల : ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో పాల్గొని ఆర్థికంగా చితికిపోయిన ఉద్యమకారులకు సంక్షేమ పథకాలు, నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం కల్పించి ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుడు కూసురు సంజయ్‌దాస్‌గౌడ్ సీఎం కేసీఆర్‌ను కోరారు. చిట్యాలలో బుధవారం నిర్వహించిన తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. నకిరేకల్ నియోజకవర్గంలో బడుగు బలహీనవర్గాలకు చెందిన ఎంతోమంది తెలంగాణ ఉద్యమంలో పనిచేసినప్పటికీ తగిన గుర్తింపు లభించలేదని వాపోయారు. నాడు జైల్లో శిక్షలు అనుభవించి, కేసులు నమోదై ఇబ్బందులకు గురైనప్పటికీ సీఎం కేసీఆర్, మంత్రి జగదీష్‌రెడ్డి నాయకత్వంలోనే పనిచేస్తూ వస్తున్నామని, తాము పార్టీ మారబోమని స్పష్టం చేశారు. ఈ నెల 17వ తేదీన నకిరేకల్ నియోజకవర్గ తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జోగు అశోక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు నర్సింహారెడ్డి, కొల్లోజు శ్రీనివాస్, గోపగోని నర్సింహగౌడ్, కూసురు శంకర్ గౌడ్, ఓర్సు వెంకటేశ్వర్లు, వెల్దుర్తి రాజు, గుంటోజు శ్రవణ్‌చారి, బింగి లింగస్వామి, పాల రాకేష్, జోగు లింగస్వామి పాల్గొన్నారు.

వరి సాగులో ఆధునిక పద్ధతులు అవలంబించాలి


వరి చేను పరిశీలిస్తున్న సంస్థ ప్రతినిధులు

కేతేపల్లి : వరిసాగులో రైతులు ఆధునిక యాజమాన్య పద్ధతులు అవలంబించి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని స్వామి వివేకానంద గ్రామీణాభివృద్ధి సంస్థ సూపర్‌వైజర్ బి.నాగరాజు కోరారు. మండలంలోని కొప్పోలు గ్రామంలో కోర్ కార్బన్‌ఎక్స్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ వారి సహకారంతో స్వామి వివేకానంద గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో తడి, పొడి నీటి యాజమాన్య పద్ధతిలో సాగు చేసిన వరి పంటలను రైతులతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం రైతులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సంస్థ మండల కోఆర్డినేటర్ వి.యాదగిరి, సీహెచ్.చంద్రయ్య,డి.కాంతయ్య, ఎస్.వెంకట్‌రెడ్డి, ఉప్పిరెడ్డి, ఎన్.సోమిరెడ్డి పాల్గొన్నారు.

డిజిటల్ విధానంపై ఎంజీయూ అధ్యాపకులకు శిక్షణ

ఎంజీయూ(నల్లగొండ రూరల్): సాంకేతికతతో జవాబుదారీతనం పెరుగుతుందని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ గోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎంజీయూలో డిజిటల్ లెసన్ ప్లాన్, విద్యార్థుల హాజరు, అకౌంటింగ్ అంశాలపై అధ్యాపకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డిజిటల్ విధానం ద్వారా పారదర్శకత పెరుగుతుందన్నారు. సాంకేతికతను వినియోగించడం ద్వారా విద్యార్థులకు పాఠ్యాంశాలను సులభంగా బోధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ కృష్ణారావు, ఎంజీ యూనివర్సిటీ అధ్యాపకులు రవి, అన్నపూర్ణ, రేఖ, శ్రీదేవి, ప్రశాంతి, ప్రేమ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంజీయూలో కాంట్రాక్ట్ అధ్యాపకుల నిరసన

ఎంజీయూ(నల్లగొండ రూరల్) : తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ మహాత్మాగాంధీ యూనివర్సిటీలో కాంట్రాక్ట్ అధ్యాపకులు చేస్తున్న నిరసనలు బుధవారం కొనసాగాయి. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ అధ్యాపకులు ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి వినతి పత్రం అందజేసి నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ అధ్యాపకులు రమేష్, శ్రీనివాస్ రెడ్డి, రాజేశ్వరి, ఆఫ్రిన్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై నిత్యావసర సరుకులు ఇవ్వాలి


ధర్నా చేస్తున్న ఐద్వా కమిటీ సభ్యులు

నల్లగొండ టౌన్ : రేషన్ దుకాణాల్లో 14 రకాల నిత్యావసర వస్తువులను సబ్సిడీ ధరలకు అందించాలని ఐద్వా కేంద్ర కమిటీ సభ్యురాలు కేఎన్ ఆశాలత రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆమె పాల్గొని మాట్లాడారు. నూతన రేషన్ కార్డులను నాలుగు సంవత్సరాలుగా ఇవ్వడం లేదని, రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు కావడం లేదని అన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగినందున నిరుపేదలకు పౌష్టికాహారం అందని ద్రాక్షలా మారిందన్నారు. ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి మాట్లాడుతూ మహిళలకు దేశంలో భద్రత కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పోలె బోయిన వరలక్ష్మి, ఉపాధ్యక్షురాలు తుమ్మల పద్మ, సహాయ కార్యదర్శి భూతం అరుణకుమార్, పాదూరి గోవర్ధని, జిల్లా కమిటీ సభ్యులు ఎండీ సుల్తాన, ఊర్మిళ, పూలమ్మ, పద్మ, మంజుల, సాయమ్మ, జయమ్మ, అండాలు, శైలజ, నూర్జహాన్, మరియమ్మ, లక్ష్మమ్మ, అనిత పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్ కోసం ఆందోళనలు


మునుగోడు : మద్దతు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు


నాంపల్లి : వినతి పత్రం అందిస్తున్న నాయకులు

మునుగోడు : మునుగోడులో రెవెన్యూ కార్యాలయం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ ప్రజా పార్టీ జాతీయ అధ్యక్షుడు మాదగోని వెంకటేశ్వర్లు గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షకు బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మద్దతు పలికారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురిగి నర్సింహగౌడ్ మాట్లాడుతూ స్థానిక ప్రజాప్రతినిధులు మునుగోడుపై సవతి తల్లి ప్రేమ చూపుతున్నారని అన్నారు. గత ఉప ఎన్నిక సందర్భంగా మునుగోడు మండలానికి ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలుచేయకపోవడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ భీమనపల్లి సైదులు, నాయకులు బొమ్మగోని అనిల్‌గౌడ్, ముచ్చపోతుల నర్సింహ, మేక ప్రదీప్, నక్క వెంకన్న, దొమ్మాటి దినేష్, రాజభాస్కర్, దేశిడి వెంకన్న, శ్రీను, యాదయ్య, శ్రీశైలం, భూపాల్, శంకరయ్య, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లిని రెవెన్యూ డివిజన్ చేయాలి

నాంపల్లి : నాంపల్లి మండల కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని, ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన చండూరు డివిజన్‌లో కలపొద్దని కోరుతూ అఖిలపక్ష పార్టీల నాయకులు బుధవారం నాంపల్లి తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. అనంతరం నాంపల్లిని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని కోరుతూ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి, సాయిరాం, సూద బోయిన పరమేష్, గాదెపాక వేలాద్రి, ఎద్దుల కోటేష్, పన్నాల మల్లయ్య, యాదయ్య, సైదమ్మ, రాములు, నర్సింహ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

నకిరేకల్ : మున్సిపాలిటీ కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీల్లో ఏపీఎం పాఠశాలకు చెందిన 34 మంది విద్యార్థులు వివిధ విభాగాల్లో డివిజన్ స్థాయికి ఎంపికయ్యారని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ కందాల స్వప్నారెడ్డి బుధవారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల అధినేత కందాల పాపిరెడ్డి, అడ్మినిస్ట్రేటర్ కందాల శ్రీకాంత్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, పీఈటీ నిమ్మల శంకర్‌లు అభినందించారు.

రైతాంగ సాయుధపోరాట యోధులకు ఘన నివాళి

మునుగోడు : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుల త్యాగాలు మరువలేనివని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా బుధవారం పలివెల గ్రామంలో సీపీఐ జెండా ఎగురవేసి అదే గ్రామంలోని సాయుధ పోరాటయోధుడు, మాజీ ఎమ్మెల్యే కొండవీటి గురునాథ్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటి పోరాటయోధుల త్యాగాల వల్ల నేడు బడుగు బలహీన వర్గాల ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ గోసుకొండ లింగయ్య, సీపీఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, గుర్జ రామచంద్రం, మాదగోని సత్తమ్మ, తిరిపారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

డిగ్రీ రీవాల్యుయేషన్ ఫలితాలు నిలిపివేత

నల్లగొండ రూరల్: ఎంజీయూ పరిధిలో డిగ్రీ రీవాల్యుయేషన్ ఫలితాలను బుధవారం యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో పెట్టి కొద్దిసేపటి తర్వాత నిలిపివేశారని విద్యార్థులు తెలిపారు. ఐసెట్ కౌన్సిలింగ్ ఈ నెల 6 నుంచి ప్రారంభంకావడంతో ఒక్క సబ్జెక్ట్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులు కౌన్సిలింగ్‌కు దూరమవుతున్నారు. కౌన్సిలింగ్‌కు వెళ్లే విద్యార్థులకు అన్ని సర్టిఫికెట్లు కావాల్సి ఉంది. ఫలితాలు విడుదలలో జాప్యం జరగడంతో విద్యా సంవత్సరం నష్టపోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

యూరియా కొరత లేదు

చండూరు : గట్టుప్పల్, చండూరు మండలాల పరిధిలో యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మండల వ్యవసాయ అధికారి మల్లేశం తెలిపారు. చండూరు రైతు సేవా సహకార సంఘం, ఫర్టిలైజర్ షాపులను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సేవా కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు ప్రతిరోజు యూరియా సరఫరా చేస్తామన్నారు.

అంగన్‌వాడీల్లో పోషణ్ అభియాన్

చిట్యాల : వెలిమినేడు, చిన్నకాపర్తి, చిట్యాల గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం గర్భిణులకు పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, తల్లులు, చిన్నారులు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై ఆయా కేంద్రాల్లో అవగాహన కల్పించారు. సర్పంచ్ బోయపల్లి వాణి శ్రీనివాస్‌గౌడ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పారిజాత, అంగన్‌వాడీ టీచర్లు దాడి అరుణ, కోనేటి మమత పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

చిట్యాల : మున్సిపాలిటీలోని తొమ్మిదో వార్డులో ప్రభుత్వ వైద్యశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. వార్డులోని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి మందులు అందజేశారు. వార్డు కౌన్సిలర్ బెల్లి సత్తయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కూరెళ్ళ లింగస్వామి, వైద్యాధికారి కిరణ్‌కుమార్, నాయకులు జగిని భిక్షంరెడ్డి, దాసరి నర్సింహ, చిత్రగంటి ప్రవీణ్‌కుమార్, కంభంపాటి నర్సింహ, శేఖర్, అశోక్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

మర్రిగూడ : మండల కేంద్రానికి చెందిన గ్యార శంకర్‌కు మంజూరైన రూ.30వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును బుధవారం దళితమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు గ్యార గోపాల్ అందజేశారు. ఆయన వెంట పోలె సైదులు, కాటిక శ్రీరాములు, మహేష్‌లు ఉన్నారు.

మేరీ మాటీ మేరా దేశ్

చిట్యాల : మేరీ మాటీ మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని గుండ్రాంపల్లిలో బీజేపీ బూత్ అధ్యక్షుడు నార్సింగ్ వెంకటేశం ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు ఇంటింటికీ తిరిగి మట్టి సేకరించారు. పెద్దగోని అంజన్‌కుమార్, బత్తుల స్వామి, గోపగోని అంజయ్య, గరిషే లింగస్వామి, నరేష్, పరమేష్, మహేష్, సిందం లింగస్వామి, రాజశేఖర్, నర్సింహ పాల్గొన్నారు.

నిమ్మకాయలు చోరీ

శాలిగౌరారం : తోటలో నిమ్మకాయలు చోరీకి గురైన సంఘటన వల్లాల గ్రామపంచాయతీ పరిధి జోలంవారిగూడెంలో మంగళవారం రాత్రి జరుగగా బుధవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. జోలంవారిగూడెంకు చెందిన జోలం నగేశ్ తన నిమ్మతోటలో మంగళవారం నిమ్మకాయలు కోసి బుధవారం మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధమయ్యాడు. ఈక్రమంలో రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు సుమారు 12 బస్తాల నిమ్మకాయలను దొంగిలించి కారులో వేసుకొని పారిపోయేందుకు ప్రయత్నించగా కారు బురదలో దిగబడి నిలిచిపోయింది. ఆ సమయంలో నిమ్మతోటవైపు వెళ్లిన గట్టిగొర్ల భిక్షం దారిలో కారు ఆగి ఉండడాన్ని గమనించి నగేశ్‌కు సమాచారం అందించాడు. పరిస్థితి గమనించిన దొంగలు కారును వదిలి పరారయ్యారు. నగేశ్ కారుదగ్గరకు వచ్చి చూడగా కారులో 12 నిమ్మకాయల బస్తాలు ఉండడంతో పోలీసులకు సమాచారమందించాడు. కారును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

ఆర్.కృష్ణయ్య జన్మదిన వేడుకలు

నల్లగొండ టౌన్ : బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య జన్మదిన వేడుకలను బుధవారం స్థానిక పూలే విగ్రహం వద్ద బీసీ సంక్షేమ సంఘం, బీసీ ఉద్యోగుల సంఘం, బీసీ మహిళా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మిర్యాల యాదగిరి, జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ, మామిడి పద్మ, లోకన బోయిన వెంకటరమణ, మునాస ప్రసన్నకుమార్, మేకల యాదన్నయాదవ్, బత్తుల శ్రీనివాస్, గుండు వెంకటేశ్వర్లు, కర్నాటి యాదగిరి, మార్గం సతీష్‌కుమార్, భరత్, సతీష్‌యాదవ్, శ్రీనివాస్, సుజాత, లలిత, లక్ష్మీనారాయణ, రవీంద్రచారి, వెంకటాచారి, తిరుతయ్య, ఉజ్వల్ పాల్గొన్నారు.

ముత్యాలమ్మ బోనాలు

చండూరు : మున్సిపల్ కేంద్రంలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన ఎస్సీ కాలనీవాసులు బుధవారం బోనాల వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కౌన్సిలర్ అన్నెపర్తి శేఖర్, బీపంగి ఆశయ్య, తుమ్మల ముత్తయ్య, బుషిపాక కృష్ణయ్య, దుబ్బ శ్రీను, తీగల అశోక్, సుదర్శన్, బుషిపాక భాస్కర్, నల్లగంటి రమేష్, అన్నెపర్తి యాదగిరి, ఇరిగి ప్రసాద్, నల్లగంటి సత్యం, శంకర్, ముత్తయ్య, సురేష్, వాసు, దుబ్బ వెంకన్న, ధనయ్య, వెంకటేష్, కర్ణాకర్, సైదులు, భిక్షం తదితరులు పాల్గొన్నారు.


వేడుకల్లో పాల్గొన్న గ్రామస్తులు